క్లుప్తంగా

రేపు ఉపాధి పనులపై ఓపెన్‌ఫోరం

కాశినాయన : మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై ఈనెల 2వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించి గ్రామసభలు నిర్వహించారు. ఇక్కడ జరిగిన పనుల విచారణపై జిల్లా డ్వామా అధికారుల సమక్షంలో ఉపాధి ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

నూతన పింఛన్లు మంజూరు

చాపాడు : మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో 154 మంది లబ్ధిదారులకు నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. మండలంలోని చిన్నగురువలూరు –15, పెద్దగురువలూరు – 12, చియ్యపాడు – 10, అన్నవరం – 12, సోమాపురం – 7, లక్ష్మీపేట – 18, పల్లవోలు – 13, ఖాదర్‌పల్లె – 5, వెదురూరు – 9, అయ్యవారిపల్లె – 3, బద్రిపల్లె – 10, ఎస్.ఓబాయపల్లె – 18, చాపాడు – 9, మడూరు – 11, అల్లాడుపల్లె – 2 చొప్పున వివిధ రకాల పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ తెలియజేశారు.

వైవీయూ బోర్డు మెంబర్‌గా చిన్నసుబ్బారావు



బద్వేలు అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా బద్వేలు పట్టణానికి చెందిన కొండపల్లి చిన్నసుబ్బారావు నియమితులయ్యారు. యూనివర్సిటీ పాలకవర్గానికి సంబంధించి 9 మందితో కూడిన కమిటీని గురువారం ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ జె.శ్యామలారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.సి.సుబ్బారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో తన నియామకానికి కృషి చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైవీయూ రిజిస్ట్రార్ ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. వైవీయూ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

బర్త్ సర్టిఫికెట్‌లు పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఇరువురు గర్భిణీలకు కాన్పు చేశారు. ఇద్దరు మహిళలు మగబిడ్డలకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వైద్యాధికారులు వీరికి బర్త్ సర్టిఫికెట్‌లను అందచేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు సురక్షితమని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వాసుపత్రులకే వెళ్లాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ వితరణ



శ్రీరాములరెడ్డికి ట్రై సైకిల్‌ను అందచేసిన స్టార్‌ఫౌండేషన్ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : దివ్యాంగుడికి స్టార్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రైసైకిల్ పంపిణీ చేశారు. కలసపాడు మండలంలోని పెండ్లిమర్రి గ్రామానికి చెందిన ముత్తుముల శ్రీరాములరెడ్డి అనే వ్యక్తి పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. నడవలేని స్థితిలో ఉన్న అతను ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో రోజు వారి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకు ట్రై సైకిల్ కావాలని ప్రొద్దుటూరులోని స్టార్‌ఫౌండేషన్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్‌ను సంప్రదించాడు. దాతల సహకారంతో గురువారం శ్రీరాములరెడ్డికి ట్రై సైకిల్‌ను అందచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆర్‌వీ చలపతి, సలీం, ధీరజ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 4 సంవత్సరాల ఆనర్స్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కళాశాలకు సైన్స్‌లో 3, ఆర్ట్స్ విభాగంలో 1 సబ్జెక్టు నందు ఆనర్స్ డిగ్రీ కోర్సుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మ్యాథమ్యాటిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ కోర్సుల్లోను, ఎకనామిక్స్‌లో 4వ సంవత్సరం ప్రవేశాలు పొందవచ్చన్నారు. 2020–23 బ్యాచ్‌లో డిగ్రీ పూర్తి చేసి 75 శాతం ఉత్తీర్ణత పొందిన మహిళా అభ్యర్థినులు ఈ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ 4 సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ పూర్తి చేసినవారు పీజీలో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ గురివిరెడ్డి, ప్రవేశాల కోఆర్డినేటర్ ఆనంద్‌కుమార్‌రెడ్డిని కలిసి ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు.

మైదుకూరు అభివృద్ధిని కళ్లు పెట్టి చూడండి

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



నానుబాలపల్లె బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : సంక్షేమమే తప్ప అభివృద్ధి లేదంటూ విమర్శలు చేస్తున్న టీడీపీ నాయకులు మైదుకూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను కళ్లు పెట్టి చూడాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అంకాలమ్మ గుడి నుంచి నానుబాలపల్లె వరకు వేసిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదుకూరులో 20 ఏళ్లుగా అభివృద్ధి అన్నది లేదన్నారు. ముఖ్యమంత్రులు మారుతున్నారు, నాయకులు వస్తున్నారు కానీ అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపి మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. అభివృద్ధి లేదంటూ విమర్శలు చేస్తున్న టీడీపీ వారికి ఛాలెంజ్ చేసి చెబుతున్నానని 2014–19 మధ్య కాలంలో మైదుకూరులో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని అన్నారు. రూ.19.10 కోట్లతో 15 బీటీ రోడ్లు వేస్తున్నామని, ఇప్పటికే రెండు రోడ్లు పూర్తయ్యాయన్నారు. భూమాయపల్లె – కృష్ణాపురం రహదారి అందులో ఒకటని, ప్రస్తుతం నానుబాలపల్లె రోడ్డును రూ.కోటితో పూర్తి చేసి ప్రారంభించినట్టు తెలిపారు. ఇవికాక పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందని, ఒక్క ఇందిరమ్మ కాలనీలోనే రూ.కోటి 30లక్షలతో సీసీ రోడ్లు వేస్తున్నట్టు తెలిపారు. మున్సిపాలిటీ భవనం పూర్తయిందని ప్రారంభించాల్సి ఉందన్నారు. పట్టణంలో కడప రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.19.40 కోట్లు మంజూరయిందని చెప్పారు. ఈ రోడ్డుకు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి బటర్‌ఫ్లై లైట్లు వేస్తున్నట్టు ఎమ్మెల్యే వివరించారు. ఎర్ర చెరువు సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, ఐదు ఎకరాల్లో పట్టణంలో రెండు కోట్ల రూపాయలతో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిపక్ష పార్టీకి ఇంత అభివృద్ధి కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి పనులు చేయకుండా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాదని వారికి తెలుసని ఏదో విధంగా అల్లర్లు సృష్టించి ప్రజల్లో ఉండాలని టీడీపీ నాయకులు భావిస్తున్నారని ఆరోపించారు. 30 ఏళ్ల చరిత్ర ఉన్న టీడీపీ జనసేనతో పొత్తు పెట్టుకోవడానికి వెంపర్లాడటం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీకి వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు వచ్చినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ వేడుకలు



మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సుధారాణి



పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి రాఖీ కట్టిన ఓంశాంతి నిర్వాహకురాలు స్వప్న

బద్వేలు అర్బన్ : రాఖీపండుగను పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్ళ అనురాగానికి ప్రతీక అయిన ఈ పండుగ సందర్భంగా పట్టణంలో పలువురు తమ సోదరులకు రాఖీకట్టి సోదరాభిమానాన్ని చాటుకున్నారు. అలాగే ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బద్వేలుశాఖ ఇన్‌చార్జి సుధారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డికి రాఖీకట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ ఎన్నిల పరిశీలకులు బంగారుశీనయ్యకు, అర్బన్ సీఐ పి.యుగంధర్‌కు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. కార్యక్రమంలో సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కౌన్సిలర్లు సత్యనారాయణ, కరీముల్లా, వార్డు ఇన్‌చార్జిలు పుత్తాశ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : రాఖీ పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓంశాంతి నిర్వాహకురాలు స్వప్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితో పాటు పలువురు పట్టణ ప్రముఖులకు రాఖీలు కట్టి రక్షాబంధనం గురించి వివరించారు. రాఖీ అన్నా చెల్లెల్లకు సంబంధించింది మాత్రమే కాదని, మనసును పవిత్రంగా చేసుకుని భగవంతుని నుంచి రక్షణ పొందేందుకే ఈ కార్యక్రమం అన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

గోపవరం : బద్వేలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బద్వేలు, గోపవరం, అట్లూరు, బి.కోడూరు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని బద్వేలు ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు మండలంలోని పుట్టాయపల్లె బీసీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు బీసీ–ఏ, బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని అబ్బరాతివీధి, గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ పోస్టులకు ఈడబ్ల్యూఎస్, బీసీ–బి, గోపవరం మండలంలోని ప్రాజెక్టుకాలనీ–1లోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు బీసీ–సి, ఎస్టీ, ఎస్.రామాపురం హెచ్‌డబ్ల్యూలోని అంగన్‌వాడీ ఆయా పోస్టు ఎస్టీ, లక్కవారిపల్లె అంగన్‌వాడీ పోస్టు బీసీ–సి, అట్లూరు మండలంలోని అట్లూరు–1 అంగన్‌వాడీ పోస్టు బీసీ–బి, బి.కోడూరు మండలంలోని ప్రభలవీడు, సిద్దుగారిపల్లె అంగన్‌వాడీ ఆయా పోస్టులకు బీసీ–ఇ, ఓసీ కేటగిరీలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానికులై ఉండి వివాహిత మహిళలు 1–7–2023వ తేదీ నాటికి 21–35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హత, కుల, ఆధార్, రేషన్, ఓటరు కార్డు సర్టిఫికెట్లను గెజిటెడ్ అధికారి ద్వారా అటెస్టెడ్ చేయించి బద్వేలు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం బద్వేలు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కాశినాయన

కాశినాయన : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పోరుమామిళ్ళ ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకులనారాయణపల్లె అంగన్‌వాడీ సహాయకురాలు ఓసీ, గంగనపల్లె అంగన్‌వాడీ సహాయకురాలు ఓసీలకు కేటాయించారు. దరఖాస్తుదారులు 7వ తరగతి పాసై ఉండి 21–35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 8వ తేదీ సాయంత్రంలోపు పోరుమామిళ్ళ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

సీపీఎం సంతకాల సేకరణ



సంతకాలను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక రాజీవ్ సర్కిల్‌లో విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు షాక్ కొట్టే విధింగా చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఏది చెబితే అది రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యుత్ చార్జీలను, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు ముంతాజ్ బేగం, శేఖర్, చెన్నారెడ్డి, ఓబయ్య, శీను, మహిళా సంఘం నాయకులు వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి



విద్యార్థులకు హోమియో మందులను వేస్తున్న డాక్టర్ రాజేశ్వరి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఆస్పత్రి హోమియో వైద్యురాలు ఎస్.రాజేశ్వరి పేర్కొన్నారు. మండల పరిధిలోని మూలవారిపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రోజూ పాలు, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని, ఫాస్ట్‌ఫుడ్ తినరాదని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని, నిత్యం వ్యాయామం చేయాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు కళ్ల కలక రాకుండా ముందస్తు నివారణ మందులను పంపిణీ చేశారు. ఎంఎస్ఓ రమణ, ఉపాధ్యాయుడు రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సెప్టెంబర్ 4న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొన్న హామీ ప్రకారం కడప ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. వంట గ్యాస్‌ను వినియోగదారులు అందరికీ సిలిండర్ ధర రూ. 500 ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, ఎంఆర్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు – ఆళ్లగడ్డ రూట్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి గిఫ్టులు అందించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు– ఆళ్లగడ్డ తిరిగే బస్సుల్లో గిఫ్ట్ స్కీం బాక్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. బస్సు దిగే ముందు ప్రయాణికులు టికెట్ వెనుకాల వారి పేరు, ఊరు పేరు, ఫోన్ నంబర్ రాసి ఆ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి 15 రోజులకొకసారి అనగా నెలలో రెండు సార్లు ఈ గిఫ్ట్ స్కీం బాక్స్‌లను తెరచి లాటరీ ద్వారా మూడు టికెట్లను ఎంపిక చేసి ముగ్గురికి గిఫ్టులు అందిస్తామని వివరించారు. ప్రొద్దుటూరు – ఆళ్లగడ్డకు ప్రయాణించే వారు ఈ గిఫ్ట్ స్కీం ద్వారా గిఫ్టులు పొందాలని ఆయన కోరారు.

సరుకులను పంపిణీ చేయాలి

ప్రొద్దుటూరు : ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెల తప్పనిసరిగా 95 శాతం తగ్గకుండా వినియోగదారులకు సరుకులు పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ జె.మనోహర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం సాయంత్రం ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీ ప్రతి ఎండీయూ తప్పనిసరిగా సరుకుల పంపిణీని ప్రారంభించాలన్నారు. సరుకుల పంపిణీ పూర్తయిన వెంటనే డీలర్లకు ఎండీయూ కమిషన్ డబ్బు చెల్లించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు తీసుకెళ్లి ఇవ్వాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో, మైదుకూరు పట్టణంలోని మైదుకూరు–1 అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టులకు 7వ తరగతి పాసై, 21 – 35 ఏళ్లలోపు వయసున్న స్థానిక వివాహిత మహిళలు సెప్టెంబర్ 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను మైదుకూరులోని మండల పరిషత్ కార్యాలయం మేడపై ఉన్న మైదుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వైజ్ఞానిక శాస్త్రాలకు నెలవు సంస్కృతం

వైవీయూ : అంతరిక్ష విజ్ఞానం, వైమానిక విజ్ఞానం వంటి అనేక వైజ్ఞానిక అంశాలకు నెలవు సంస్కృత భాష అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో అంతర్జాతీయ సంస్కృత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఆయన హయగ్రీవ జయంతి విశిష్టతను, జన్మరహస్యాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ అనేక సాహిత్య చరిత్రలకు పునాది సంస్కృతమన్నారు.

హాకీ ఆస్ట్రో టర్ఫ్ ఏర్పాటుకు వినతి

కడప స్పోర్ట్స్: కడప నగరంలో హాకీ క్రీడకు సంబంధించి ఆస్ట్రో టర్ఫ్‌ను ఏర్పాటు చేయాలని ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్ ఎస్. సుభాన్‌బాషా కోరారు. గురువారం శాప్ ఎండీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ధ్యాన్‌చంద్రను ఆయన కలిసి విన్నవించారు. క్రీడాసంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

జీతాలు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఇటీవల బదిలీలు, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలను చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం జిల్లా ఉప ఖజాన అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని సమర్పించారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సామూహికంగా మహిళలు లలిత సహస్రనామపారాయణం చేశారు. పూజాకార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. అలాగే శివాలయం వీధిలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయస్వామి, అనఘాదేవిలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



చియ్యపాడులో గ్రామ సభ నిర్వహించిన దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామ పంచాయతీలో గురువారం సర్పంచ్ శివప్రసాద్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో అధికంగా తాగునీటి సమస్య, పశువైద్య సిబ్బంది లేక పాడి రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. వెంటనే పశు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని గ్రామ సభలో పేర్కొన్నారు. అలానే గ్రామ పంట పొలాల్లో విద్యుత్ తీగెలు తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. స్పందించిన సర్పంచ్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మంచినీటి సమస్య తలెత్తిందన్నారు. ఇప్పటికే 9 గంటలపాటు మోటార్లను వినియోగిస్తూ నీటి సరఫరా చేస్తున్నామని, దీంతోపాటు రెండు జనరేటర్లను ఏర్పాటు చేసి అదనంగా మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ–1 బాలనరసింహారెడ్డి, ఎంపీటీసీ–2 సుబ్బరామిరెడ్డి, ఉపసర్పంచ్ ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

ప్రొద్దుటూరు : పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు శిక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రమణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కల్లూరు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ సమిష్టిగా పాల్గొని నిర్ణయాలు తీసుకునే పొలంబడి కార్యక్రమంలో రైతులు ప్రతివారం పాల్గొనాలని సూచించారు. వరి పొలంలో నీరు ఎక్కువగా పెట్టడం వల్ల దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. వరి పొలాలను పరిశీలించి నీటిపై ఎక్కువగా తిప్పలు కట్టినట్లయితే సలఫర్ ఇంజూరీ జరుగుతుందని, నీటిని తీసేసి తక్కువ తడి ఉండునట్లు చూసుకోవాలని తెలిపారు. భూసార పరీక్షను అనుసరించి ఎరువులు వాడుకోవాలన్నారు. పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు రైతులు వ్యవసాయాధికారులను తప్పనిసరిగా సంప్రదించాలని తెలిపారు. వ్యవసాయ శిక్షణ కేంద్రం ఏట పద్మజ వరి పొలంలో రైతులు లీఫ్ కటింగ్ ప్రయోగం చేసి దాని వలన కలిగే ఉపయోగం వివరించారు. వ్యవసాయాధికారి శివశైలజ, మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి, వీఏఏ శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు గణిత దీప్తి పంపిణీ



విద్యార్థినులకు గణిత దీప్తి పుస్తకాలను అందిస్తున్న దృశ్యం

మైదుకూరు : పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు కె.రాధా నరసింహరాజు పదో తరగతి విద్యార్థినులకు గురువారం గణిత దీప్తి మెటీరియల్‌ను అందజేశారు. రాధా నరసింహరాజు ఇటీవలే బదిలీపై మైదుకూరు బాలికల ఉన్నత పాఠశాలకు గణిత ఉపాధ్యాయుడిగా వచ్చారు. పాఠశాలలో 82 మంది పదో తరగతి విద్యార్థినులకు గణిత దీప్తి మెటీరియల్‌ను అందజేయడమేగాక వారి పరీక్షల ఫీజునూ తానే చెల్లిస్తానని ఉపాధ్యాయుడు తెలిపారు. తాను పాఠశాలలో పని చేసినంత కాలం పదో తరగతి విద్యార్థినులకు గణిత దీప్తి పుస్తకాలను అందించడమేగాక వారికి పరీక్ష ఫీజు కూడా చెల్లిస్తానని ఆయన స్పష్టం చేశారు. రాధా నరసింహరాజు వితరణ పట్ల పాఠశాల హెడ్ మాస్టర్ గంగాభవాని, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి, ఆయనను అభినందించారు.

మరియ తల్లి మార్గం ఆదర్శనీయం



దైవ సందేశం అందజేస్తున్న క్రైస్తవ గురువు

కడప కల్చరల్ : మరియ తల్లి మనకెంతో ఆదర్శనీయమని, ఆ తల్లి నుండి మనం అనేక విషయాలను నేర్చుకోవాలని, రామకుప్పం విచారణ గురువులు రెవ ఫాదర్ చిన్నప్ప రాయర్ అన్నారు. కడప నగరం రైల్వే స్టేషన్ సమీపంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవ దిన ఉత్సవాలను పురస్కరించుకుని మూడవరోజు గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- పలమనేరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జయపాల్ దివ్యబలి పూజను సమర్పించగా, చిన్నప్ప రాయల్ మరియమాత సందేశాన్ని వినిపించారు. మరియ తల్లి క్రీస్తు ప్రభువుకు అత్యంత సన్నిహితమైనదిగా, ప్రథమ శిష్యురాలిగా ఆయన వెంట నడిచినదని, క్రీస్తు ప్రభువుకు జన్మనిచ్చిన తల్లే ఆయన అడుగుజాడల్లో నడిచిందని, మనం కూడా మరియ తల్లి లాగా క్రీస్తు బాటలో పయనించాలని ఆయన సూచించారు. కార్యక్రమ ప్రారంభంలో మరియమాత స్వరూపాన్ని కనుల పండువగా అలంకరించి పల్లకీపై ఏర్పాటు చేశారు. భక్తిగీతాలను ఆలపిస్తూ ఆ క్షేత్రంలో ఊరేగింపు నిర్వహించి ప్రధాన వేదిక వద్దకు తెచ్చి ప్రతిష్ఠించారు. పాటలు, తేరు అలంకరణ, దివ్యబలి పీఠం అలంకరణ పలమనేరు డీన్ బృందం నిర్వహించారు.
- దివ్యపూజ బలిపూజ అనంతరం పూజను, సందేశాన్ని అందించిన గురువులను శాలువా, పూల మాల, పుష్పగుచ్ఛం, శాంతి సేవా సొసైటీ జ్ఞాపికతో మెమెంటో, అరులయ్య కరుణయ్య పుస్తకంతో వారిని కమిటీ సభ్యులు సత్కరించారు.
- ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎం డి ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ ఆరోగ్యమాత అమ్మగార్లు మరియాపురం పెద్ద చర్చి విచారణ గురువులు రెవ ఫాదర్ బిరుసు రాజా, బిషప్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.